క్లుప్తంగా

నేడు పాఠశాలల బంద్

నారాయణపేట రూరల్: ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కన్వీనర్ నరేష్, పట్టణ ఉపాధ్యక్షుడు చరణ్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి బంద్‌కు సంబంధించిన సమాచారం తెలియజేశారు. అదేవిధంగా ట్రస్మా జిల్లా, పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ఖదీర్‌లను కలిసి అన్ని ప్రైవేట్ పాఠశాలలు బంద్‌కు సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బుధవారం తరగతులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.

28న తైబజార్ వేలం

మరికల్: గ్రామ పంచాయతీ ఆవరణలో ఈ నెల 28న తైబజార్ వేలం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్యాం సుందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తైబజార్ వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ. 50వేలు డిపాజిట్ చేయాలన్నారు. అదే రోజు ఉదయం 10గంటల లోపు వేలం పాటలో పాల్గొనే వారు రూ. 50వేలు డిపాజిట్ చేసిన రసీదు పొందాలని సూచించారు.

బాధితుడికి పరామర్శ

మరికల్: మండలంలోని అప్పంపల్లిలో జరిగిన ఏరువాక పౌర్ణమి వేడుకల్లో ఎద్దుల కింద తీవ్రంగా గాయపడ్డ బాల్‌రెడ్డిని మంగళవారం రాష్ట్ర బీజేపీ నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి పరామర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లా ఎస్వీఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్యంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులకు సూచించారు.

చిన్నారులకు పలకల పంపిణీ



ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం హిందిపండిత్ శంకర్ విద్యార్థులకు పలకలను పంపిణీ చేశారు. సుమారు 40మంది విద్యార్థులకు పలకలు, పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం గౌరమ్మ, ఉపాధ్యాయులు ధనుంజయ్య, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలకు అవగాహన

మక్తల్: పట్టణంలోని నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆర్ఎంపీలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు.. హైదరాబాద్‌లో రెనావా ఆస్పత్రి డాక్టర్. రాఘవేందర్ సునీల్‌కే మాట్లాడుతూ ఆర్ఎంపీలు గ్రామస్థాయిలో తమ పరిధి వరకే చికిత్సలు చేయించి పంపించాలన్నారు. చికిత్సలు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఆర్ఎంపీల వ్యవస్థాపకుడు సిద్రామేశ్వర్, మండల అధ్యక్షుడు అశప్ప, మేనేజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ హెచ్ఎంకు సన్మానం



మాగనూర్: మండల పరిధిలోని నేరడగం జెడ్పీ ఉన్నతపాఠశాల హెచ్ఎం, నేరడగం కాంప్లెక్స్ హెచ్ఎం శంకరచారి మంగళవారం మొదటిసారిగా ఉజ్జెల్లి పాఠశాలను సందర్శించినందుకు, పదోన్నతి పొందినందుకు గాను ఉజ్జెల్లి పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరచారి మాట్లాడుతూ.. మండలంలో పని చేయడానికి చాలా ఆనందంగా ఉందన్నారు. అందరి సహకారంతో విద్యాభివృద్ధికి తమవంతు కృషిచేస్తామన్నారు. ఉజ్జెల్లి పాఠశాల హెచ్ఎం సాయిబాబా, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

పది ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలి

ధన్వాడ: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతులతో మాట్లాడి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పది ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలని వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు మంత్రికి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్‌సుధాకర్, డివిజన్ వ్యవసాయ అధికారి ప్రదీప్, ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

జీరో బిల్లుల కోసం దరఖాస్తులు చేసుకోవాలి

మరికల్: ప్రజాపాలనలో దరఖాస్తు చేసి జీరో బిల్లు రాని వారి మరోసారి గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ పావని అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జీరో బిల్లు రాని వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు.



రహదారుల నిర్వహణ ఏది?

- రోడ్డుకు ఇరువైపుల పెరిగిన ముళ్ల పొదలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కాన్‌కుర్తి శివారులో రోడ్డుపై వాలిన ముళ్లచెట్లు



దామరగిద్దకు వెళ్లే ప్రధాన రహదారిపై వాలిన ముళ్ల చెట్లు (ఫైల్)

దామరగిద్ద: ప్రధాన రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ప్రతి ఏటా రోడ్ల నిర్వహణ చేపట్టాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రధాన రహదారులు ముళ్లచెట్లతో ప్రమాద భరితంగా మారాయి. వర్షాకాలం కావడం ముళ్లపొదలు రోడ్డుకు అడ్డంగా పెరిగి వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దామరగిద్ద రహదారిలో కొండారెడ్డిపల్లి రెవెన్యు శివారులో ఎస్పీ కార్యాలయానికి ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న ప్రాంతంలో ముళ్లపొదలు రోడ్డును ఆక్రమించాయి. ఇటుక బట్టి, బొగ్గురాళ్ల సమీపంలో పలుచోట్ల ముళ్లపొదలు రోడ్డు వైపు కమ్ముకున్నాయి. ఎనిమిది కిలోమీటర్ల మేర పలు చోట్ల కంపచెట్లు, ఇసుక మేటలతో రహదారులు ఇరుకుగా మారాయి. దామరగిద్ద నుంచి యానుగంది, మద్దూర్ వరకు 12కిలో మీటర్ల రహదారిలో పలుచోట్ల రోడ్డుపై ముళ్లపొదలు, కంపచెట్లు కమ్ముకున్నాయి. కాన్‌కుర్తినుంచి మల్‌రెడ్డిపల్లి మీదుగా లోకూర్తి వెళ్లేదారిలో కాన్‌కుర్తి శివారులో రోడ్డుపై మురికితుమ్మ చెట్లు రోడ్డుపైకి వాలడంలో రోడ్డు ఇరుకుగా మారి ఎదురెదురు వాహనాలు దాటే సమయంలో కంపచెట్లు తగులుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

పంచాయతీరాజ్ రోడ్లను పట్టించుకొండి..

మండలంలోని సజనాపూర్, మల్‌రెడ్డిపల్లి, లోకూర్తి, అన్నాసాగర్, చాకలోన్‌పల్లి, కండెన్‌పల్లి తదితర గ్రామాలకు వెళ్లే గ్రామ పంచాయతీ రోడ్డు నిర్వహణకు చోటుచేసుకోకపోవడంతో జంగల్‌కటింగ్ చేపట్టక కంపచెట్లు రోడ్డుపై వాలుతున్నాయి. వాహన రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మలుపుల ప్రాంతంలో చెట్లు పెరగడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు సైతం కన్పించక వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగే అవకాశాలు లేక పోలేదు. ఆర్‌అండ్‌బీ, పీఆర్, గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి చెట్లను తొలగించి రోడ్డు సౌకర్యాన్ని మెరుగుపరచాలని కోరుతున్నారు.

ముళ్ల చెట్లను తొలగించాలి



రోడ్డు పక్కన కంపచెట్లు పెరిగి రోడ్డుపైకి వాలాయి. పెద్ద వాహనాలు ఎదరుగా వచ్చినప్పుడు సైడ్ తీసుకునే సమయంలో ప్యాసింజర్‌కు ముళ్లకంప గీసుకుపోయి గాయాలవుతున్నాయి. అధికారులు కంపచెట్లను తొలగిస్తే రోడ్డుపైకి వెళ్లే వాహనదారులకు సౌకర్యంగా ఉంటుంది.

- ఎండీ ఆలీ, ఆటో డ్రైవర్, ఉద్మల్‌గిద్ద

ప్రమాదాలు జరుగుతున్నాయి..



ప్రధాన రహదారితోపాటు గ్రామాలకు వెళ్లే పంచాయతీ రోడ్డు ముళ్ల కంప చెట్లతో రోడ్డు కమ్ముకుపోయాయి. కాన్‌కుర్తి నుంచి మల్‌రెడ్డిపల్లికి వెళ్లే రోడ్డుపై మురికితుమ్మ చెట్లు అల్లుకుపోవడంతో మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ముళ్లపొదలు తొలగించాలి.

- బస్వరాజ్, ఎంపీటీసీ, కాన్‌కుర్తి

ముళ్ల పొదలను తొలగిస్తాం



ప్రధాన రహదారులపై పలు చోట్ల జంగల్‌కటింగ్ చేపట్టాల్సి ఉంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో చెట్లు పెరిగి రోడ్డు ను ఆక్రమిస్తున్న మాట వాస్తవ మే. ప్రమాదాల నివారణకు రోడ్డుపై వాలిన చెట్లను గ్యాంగ్ మెన్‌లతో తొలగించి సౌకర్యం కల్పిస్తాం.

- రాములు, డీఈ ఆర్ అండ్ బీ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఊట్కూర్‌లో ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ



దామరగిద్దలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జానకమ్మ

ఊట్కూరు: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ ధనుంజయగౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై చర్చించారు. మలేరియా, డెంగ్యూ, కలరా వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ఈ వ్యాధుల నుంచి ముందుజాగ్రత్తలు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఈ మేరకు.. ఎంపీడీఓ ధనుంజయగౌడ్ మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా గ్రామాల్లో చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వైద్య సిబ్బంది ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్‌సాయిరాం, డాక్టర్ భవాని, డాక్టర్ వినోద్, వైద్యసిబ్బంది మణిమాల, విజయ్‌కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ జానకమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని క్యాతన్‌పల్లిలో సమన్వయ కమిటీ సమావేశంలో భాగంగా సీజనల్ వ్యాధులపై అవగాహన నిర్వహించారు. ఈగలు దోమలు, వ్యాప్తిచెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి రాములు, పంచాయతీ కార్యదర్శి సీత, ఆరోగ్య కార్యకర్త అరుణ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన



మక్తల్: కర్ణాటక రాష్ట్రంలోని బాగల్‌కోడ్‌లో ఈ నెల 10వ తేదీ నుంచి 13 వరకు కొనసాగిన సౌత్‌జోన్ ఉషూ క్రీడల్లో విజయం సాధించి పతకాలు పొందిన విద్యార్థులను మంగళవారం కలెక్టర్ సిక్తాపటాన్యక్ అభినందించారు. 30 కిలోలు అండర్ 12 బాలికల విభాగంలో సిద్దం శెట్టి, హాసిని ఒడిశా, కేరళలో మూడో స్థానం నిలిచింది. 38 కిలోలు బాలికల విభాగంలో వై.హరిప్రియ, 48 కిలోలు అండర్ 17 విభాగంలో సాన్సు ఆరో ర్యాంకు సాధించారు. సదియా నాస్మిన్ మెరిట్ సర్టిఫికెట్ పొందారు. డీవైఎస్ఓ వెంకటేష్‌శెట్టి, సలాబిన్ ఉమర్, అంబ్రేస్, అశోక్, రమణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న సీఎఫ్ఎల్ కౌన్సిలర్

కృష్ణా: ప్రధానంగా జేజేబీవై, ఏపీవై, సుకన్య సమృద్ధి యోజన తదితర అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు, అన్ని మండలాల సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక రైతు వేదికలో నిర్వహించిన అవగాహనలో సీఎఫ్ఎల్ కౌన్సిలర్ తాయప్ప హాజరై మాట్లాడారు. ప్రజలు సైబర్ నేరాలపై పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. మోసగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థకు చెందిన అధికారులు అనుసూయ, చాంద్ సుల్తాన తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పీఆర్టీయూ నాయకులు

నారాయణపేట రూరల్: ఇటీవల జిల్లాకు బదిలీపై వచ్చిన కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను మంగళవారం పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి మొక్కను బహుకరించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని, జిల్లాలో జరుగుతున్న బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యాద్గీర్ జనార్దన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, బాధ్యులు జనార్దన్‌మొల్గాన్, రఘువీర్, సత్యనారాయణ, భాస్కర్, రవికుమార్, శ్రీనివాస్, ప్రకాష్, వెంకటప్ప, సుదర్శన్ పాల్గొన్నారు.

గుండుమాల్ సంతకు వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

కోస్గి: గుండుమాల్ మండల కేంద్రంలో పశువుల సంతకు, తైబజార్‌లకు అధికారులు మంగళవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎంపీఓ వేణుగోపాల్‌రెడ్డి, గ్రామ ప్రత్యేకాధికారి ఆనంద్ కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలంలో పశువుల సంతను రూ.6.31 లక్షలకు అత్యధికంగా పాటపాడి గ్రామానికి చెందిన బోయిని వెంకటయ్య టెండర్ దక్కించుకున్నారు. తైబజార్‌కు సంబంధించి ఎవరు ఆసక్తి చూపకపోవడంతో టెండర్ ప్రక్రియను వాయిదా వేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయిప్రకాష్‌రెడ్డి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

గురుకుల పోస్టులు భర్తీ చేయాలి

నారాయణపేట రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 9210 గురుకుల పోస్టులను మొత్తం భర్తీ చేయాలని పలువురు అభ్యర్థులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 1: 2 నిష్పత్తిలో ధృవపత్రాలను పరిశీలించగా ఒక్కొక్కరికీ రెండు అంతకంటే ఎక్కువ స్థానాలు కేటాయించబడ్డాయి. దీంతో దాదాపు 3వేల పోస్టులు ఖాళీగా మిగలనున్నాయి. వారు ఎంచుకోగా మిగిలిపోయిన వాటిని మిగితా వారితో భర్తీ చేయాలని కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో హెచ్ నర్సింహ, రాజేష్, సురేందర్‌గౌడ్, రాధాకిషన్, శివకుమార్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవం



కన్మనూర్‌లో పోలేరమ్మ జాతరను జరుపుకొంటున్న భక్తులు



కిష్టంపల్లిలో అమ్మవారికి బలిచ్చే పొటేళ్లతో భక్తులు

మక్తల్: మండలంలోని భూత్పూర్, కాట్రేవ్‌పల్లి గ్రామాల్లో పోలేరమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలుచేసి మొక్కులు చెల్లించుకున్నారు. అంతంకుముందు పవిత్ర కృష్ణానీటిని తీసుకొచ్చి అమ్మవారికి పుష్కర స్నానంచేయించి పూజలు చేశారు. వివిధ గ్రామాల్లో పోలేరమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు.

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం పోలేరమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాల పండుగను ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. యాంకి చెరువు కట్టపై వెలిసిన పోలేరమ్మ ఆలయానికి లంకాల్ నుంచి మహిళలు పోటెత్తారు. ఈ మేరకు.. మహిళ భక్తులు బోనాలతో అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మరికల్: మండలంలోని కన్మనూర్‌లో మంగళవారం పోచమ్మ బోనాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేసి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అమరచింత: మండలంలోని కిష్టంపల్లిలో మంగళవారం పోచమ్మ దేవత బోనాల ఉత్సవాన్ని గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి సంవత్సరం గ్రామ ప్రజలందరూ సమైక్యంగా బోనాల పండుగకు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ గ్రామానికి చేరుకుని అమ్మవారికి బోనం సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద పోచమ్మ దేవతకు నైవేద్యంగా పోటేళ్లు, కోళ్లు బలిచ్చారు. ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు వసతులను ఏర్పాటు చేశారు.

భూ సదస్సును జయప్రదం చేయండి

మరికల్: జిల్లా కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే భూ సదస్సు ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి బాలప్ప, గోపాల్ అన్నారు. మండలంలోని మంగళవారం సర్వే నంబర్ 449లో భూములు పొందిన రైతులతో కలిసి వారు మాట్లాడారు. నారాయణపేటలో బుధవారం నిర్వహిస్తున్న భూ సదస్సుకు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కుంభం శివకుమార్‌రెడ్డి అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. అధిక సంఖ్యలో రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బాంరాజ్, బాలప్ప, మల్లయ్య, సుదర్శన్, రఘు, రాములు, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్ అభివృద్ధికి కృషి..



కోస్గిలో కల్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేస్తున్న తిరుపతిరెడ్డి, కడా ప్రత్యేకాధికారి

కోస్గి: కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జితిరుపతిరెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో కలిసి గుండుమాల్, కోస్గి మండలాల్లో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో సమగ్ర అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా గుండుమాల్ మండలంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. కోస్గి విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించే సబ్ డివిజనల్ కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్ఈ ప్రభాకర్, డీఈ సంజీవ్ రెడ్డి, ఏడీ సుధారాణి, ఏఈ పర్వతాలు, ఎంపీపీ మధుకర్‌రావు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు వార్ల విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, విక్రంరెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, తుడుం శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, భానునాయక్, హరి, నర్సింహ పాల్గొన్నారు.

మద్దూరు: మద్దూరు, కొత్తపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ నియోకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిందని గుర్తుచేశారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ చెక్కులను కుటుంబ అవసరాలను వాడుకోవాలని సూచించారు. అలాగే రూ. 46కోట్ల ఆర్‌అండ్‌బీ నిధులతో వివేకానంద చౌరస్తా నుంచి పెదిరిపాడ్, ఒత్తుగుండ్ల మీదుగా నారాయణపేట వరకు డబుల్‌రోడ్డు పనులకు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. మద్దూరు శివారులోని కాచువాగుపై రోడ్డు కం బ్రిడ్జి నిర్మాణం రూ.4.25 కోట్లతో, భూనీడ్, కొత్తపల్లి రోడ్డుపై వాగు వద్ద రూ.10 కోట్లతో చేపట్టే రోడ్డుకు బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్లు మహేష్‌గౌడ్, అనిల్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, కో–ఆప్షన్ సభ్యులు ఇబ్రహీం, పార్టీ నాయకులు సంజీవ్, తిరుపతిరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, చెన్నప్ప, రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఊట్కూరు: వ్యవసాయ కార్మికుల సమగ్రచట్టం చేయాలని కోరుతూ కేవీపీకేఎంఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ మేరకు.. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంత్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎరువులు, పురుగుల మందులపై సబ్సిడీలు ఇవ్వాలని రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. దేశంలో రైతులు వ్యవసాయ కార్మికులు వారివారి సమస్యల వేర్వేరు సంఘాలను ఏర్పాటు చేసుకొని సమస్యల సాధనకోసం పోరాడుతున్నారని ఆయన తెలిపారు. అనంతరం తహసీల్దార్ మమతకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సలీం, కనకారాయుడు, బాబు, చెన్నప్ప పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణలో ముందుండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్‌కుమార్

అమరచింత: విద్యార్థులు మాదక ద్రవ్యాల నియంత్రణలో ముందుండాలని, వీటి వల్ల కలిగే అనర్థాల గురించి కుటుంబ సభ్యులకు వివరించాలని ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల యువతపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల జీహెచ్ఎం కృష్ణవేణితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇది ప్రకృతి వనమే..



అమరచింత: ప్రభుత్వ ఖాళీ స్థలాలను వృథాగా వదిలివేయడంతో ప్రకృతి తన పని తాను చేసుకుంటూ పోతుందని చెప్పడానికి ఈ ఫొటోలో కనిపిస్తున్న పట్టణ ప్రకృతి వనమే నిదర్శనం. అమరచింత మున్సిపాలిటీలోని నాల్గో వార్డులో మూడేళ్ల కిందట ఆగమేఘాల కింద రూ.5 లక్షల ప్రతిపాదనలతో పట్టణ ప్రకృతి వనం ఏర్పాటు చేసి వాటికి జైభీమ్ పార్క్ అంటూ నామకరణం చేశారు. కానీ వాటిలో పూలు, పండ్ల మొక్కలు, పచ్చని గడ్డి పెంచకపోవడంతో వాటిలో ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి. విషయాన్ని అక్కడి కౌన్సిలర్ పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేదు.

భగవద్గీత సాధకులకు కల్పవృక్షం



నర్వ: భగవద్గీత మానవులకు ఆశాదీపం, సాధకులకు కల్పవృక్షమని భగవద్గీత ప్రచారకుడు బాలచంద్ర భాగవతార్ అన్నారు. మంగళవారం పెద్దకడ్మూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన భగవద్గీత ప్రవచనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రవీణ్‌కుమార్ శ్రీకృష్ణ భగవానునికి ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమానికి అంకురార్పరణ చేశారు. రెండురోజులుగా ఆలయ ఆవరణలో పారాయణం, ప్రవచనం, భాగవత ప్రవచనంలో ఆయన ప్రజలకు గానం చేస్తూ వివరించారు. ప్రవచనంలో గ్రామస్తులు పెద్దఎత్తున ఆలకించారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న వీఓఏలు

మక్తల్: వీఓఏల సమస్యలు పరిష్కరించాలని మండల సమాఖ్య అధికారి వనజమ్మకు సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏలు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు.. కనీస వేతనం రూ. 26వేల చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, అమలు చేయాలని, బీమా సౌకర్యాం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవిందురాజ్, రాంరెడ్డి, బాలప్ప, జ్యోతి, రాధ, రాజు, మౌనిక, శైలజ, నర్సింహ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ బోర్డు ఏర్పాటు



ధన్వాడ: మండల కేంద్రంలోని సింపులోని కాల్వ వద్ద ఉన్న గ్రామ కంఠం భూమిలో మంగళవారం పంచాయతీ కార్యాదర్శి శ్రీనివాస్‌రావు సిబ్బందితో కలిసి బోర్డు ఏర్పాటు చేశారు. ఇక్కడ గ్రామ కంఠం భూమి ఉందని ఇది కబ్జాకు గురవుతుందని పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వే నిర్వహించిన అధికారులు గ్రామ కంఠం భూమి అని తెలడంతో అక్కడ బోర్డు ఏర్పాటుచేశారు.

అనంత్ రెడ్డికి నివాళి

మరికల్: అప్పంపల్లి మొదటి సర్పంచ్‌గా పనిచేసిన వై.అనంత్ రెడ్డి సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అప్పంపల్లిలో ఏర్పాటు చేసిన ఆయన వర్ధంతి సభలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విండో చైర్మన్ వెంకట్రామారెడ్డి, కృష్ణారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వేణు, వెంకట్‌రెడ్డి, అనంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.